శ్రీ చైతన్య విద్యార్థిని నేషనల్ తైక్వాండో పోటీలో విజేత

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఇటీవల విజయనగరం'విజ్జి స్టేడియంలో రాష్ట్రస్థాయి తైక్వాండో వారు నిర్వహించిన జాతీయ స్థాయి తైక్వాండో టోర్నమెంటుకు శ్రీ చైతన్య పాఠశాలకు చెందిన విద్యార్థిని దీక్ష స్టేట్ నుండి నేషనల్ కు సెలెక్ట్ అయినందుకు' మెడల్.ను బహుకరించారు. ఈ సందర్భంగాశ్రీ చైతన్య పాఠశాలల ప్రాంతీయ సంచాలకులు వి.శ్రీనివాసరావు విద్యార్థినికి అభినందనలు తెలియజేస్తూ, ఇలాగే మరెన్నో విజయాలను పొందాలని ఆకాంక్షించారు. ఇదే సందర్భంగాపాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధర్ బాబుమాట్లాడుతూ మీ విద్యార్థి జీవితంలో మరెన్నో ఇలాంటి విజయాలను సాధించాలని ఆశీస్సులు అందించారు. పాఠశాల డీన్ సూర్యచంద్ర, వైస్ ప్రిన్సిపల్ విక్రమ్ ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయ వర్గం విద్యార్థినిని అభినందనలతో కొనియాడడం,తోపాటు శుభాకాంక్షలు తెలియజేశారు.

తగ్గుముఖం పట్టిన డయేరియా

- జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్
- గుర్ల గ్రామంలో కలెక్టర్ పర్యటన
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష
- కొండపాలెం తాగునీటి పథకం పరిశీలన

విశాలాంధ్ర-నెల్లిమర్ల: గుర్లలో డయేరియా వ్యాధి తగ్గుమఖం పట్టిందని, పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు.ఆయన గుర్ల గ్రామంలో శుక్రవారం పర్యటించారు.పారిశుధ్యం, త్రాగునీటి సరఫరా, పైప్‌లైన్లను పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.సెప్టిక్‌ట్యాంకులనుంచి వచ్చే వ్యర్థాలు కాలువల్లో కలవకుండా చూడాలని, భూగర్భ జలాలు, త్రాగునీరు ఎక్కడా కలుషితం అవ్వకుండా చర్యలు తీసుకోవాలని

ఆదేశించారు. చికిత్స పొందుతున్న రోగుల యోగక్షేమాలను విచారించారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.డయేరియా అదుపు చేసేందుకు తీసుకున్న చర్యలు, పారిశుధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరా, వైద్య సదుపాయాలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ, గ్రామంలో పరిస్థితి పూర్తిగా అదుపులో ఉందని చెప్పారు. శుక్రవారం కొత్తగా ఆరు కేసులు మాత్రమే నమోదయ్యాయన్నారు. వారికి మెరుగైన చికిత్సను అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు సంభవించిన మరణాల్లో కేవలం ఒక్కరు మాత్రమే డయేరియా కారణంగా మరణించారని, మిగిలినవారు ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందారని తెలిపారు. వైద్యారోగ్యం, గ్రామీణ నీటి సరఫరా, పంచాయితీ శాఖలు సమన్వయంతో పనులు చేస్తున్నారని చెప్పారు. భూగర్భ జలాలు కలుషితం అవ్వడం వల్లే గ్రామంలో డయేరియా వ్యాధి ప్రభలిందని తేలినట్లు చెప్పారు.గ్రామంలో మొత్తం 277 బోర్లు ఉన్నాయని, అక్కడ కేవలం 15 అడుగుల లోతులోనే భూగర్భ జలాలు అందుబాటులో ఉండటం, బోరు నీరు కలుషితం అవ్వడం వల్లే ఈ వ్యాధి సోకిందని వెల్లడించారు. బోరునీటిని వినియోగించకుండా చర్యలు తీసుకున్నామని, గత ఐదు రోజులనుంచీ నాగావళి త్రాగునీటి పథకం నుంచి నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నామని వివరించారు.మొత్తం గ్రామంలోని బోర్లు, త్రాగునీటి వనరులను పూర్తిగా క్లోరినేషన్ చేయించామని కలెక్టర్ చెప్పారు. సూపర్ క్లోరినేషన్ వల్ల ప్రస్తుతం నీరు సురక్షితంగా మారిందని తెలిపారు. అయినప్పటికీ మరోమారు నీటిని పరీక్షిస్తామన్నారు. గ్రామంలో రోజుకు రెండుసార్లు శానిటేషన్ చేస్తున్నామన్నారు. ప్రతీ 20 ఇళ్లకు ఒక ఎఎన్ఎంను నియమించామని, వీరు ప్రతిరోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఇంటింటికీ వెళ్లి సర్వే చేస్తున్నారని, ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేస్తున్నారని చెప్పారు.గ్రామంలోని పరిస్థితి పూర్తిగా సాధారణ స్థితికి చేరుకొనేవరకు వీటిని కొనసాగిస్తామని తెలిపారు. రోగులకు మంచి చికిత్సను అందించడంతోపాటు, అబ్జర్వేషన్‌లో కూడా ఉంచుతున్నామని చెప్పారు. మండలంలో ఇతర గ్రామాల్లో ఎక్కడా డయేరియా లేదని కలెక్టర్ తెలిపారు.

కొండపాలెం తాగునీటి పథకం పరిశీలన

నెల్లిమర్లలో చంపావతి నదివద్దనున్న కొండపాలెం రక్షిత మంచినీటి పథకాన్ని కలెక్టర్ పరిశీలించారు.త్రాగునీటి సరఫరాపై ఆరా తీశారు. ఇన్ ఫిల్టర్ బావులను, నది నీటిని సైతం పరిశీలించారు. క్లోరినేషన్ చేసి సురక్షిత నీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. నదిలో కూడా కాలుష్యం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.ఈ పర్యటనలో మెడికల్ హెల్త్ డైరెక్టర్ పద్మావతి, జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, పంచాయితీ అధికారి టి.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్, పంచాయితీ రాజ్ ఎస్ఈ ఎం.శ్రీనివాస్, జెడ్‌పి సిఇఓ బివి సత్యనారాయణ, ఆర్‌డిఓ బి.సత్యవాణి, తాసిల్దార్ ఆదిలక్ష్మి, ఎంపిడిఓ శేషుబాబు, ఎంఈఓ భానుప్రకాష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రామతీర్థాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తా

నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

విశాలాంధ్ర-నెల్లిమర్ల: పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేస్తామని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. పల్లె పండగలో భాగంగా రూ.2 కోట్ల ఉపాధిహామీ నిధులతో నిర్మించనున్న గిరిప్రదక్షిణ రహదారికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రామతీర్థాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. మండలవ్యాప్తంగా సీసీ రోడ్లు, మురుగునీటి కాలువల నిర్మాణానికి రూ. 36 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. మరో రూ.12 కోట్లు అదనంగా మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. వైకుంఠ ఏకాదశికి గిరి ప్రదక్షిణ రహదారి పూర్తి చేస్తామని చెప్పారు. మంజూరైన పనులన్నీ సంక్రాంతి లోపు పూర్తిచేయాలని సూచించారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా ఉండేందుకు ప్రత్యేక బృందాన్ని నియమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, ఎంపీడీఓ రామకృష్ణ రాజు, తహశీల్దార్ సుదర్శనరావు, ఏపీఓ అరుణ, ఎన్డీయే కూటమి నాయకులు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, చనమల్లు వెంకటరమణ, బూర్లే శ్రీధర్, జనా ప్రసాద్, రవ్వా నాని, యడ్ల గోవింద్, నల్లి చంద్రశేఖర్, ఎంఎం నాయుడు, రామతీర్థం, సీతారామునిపేట గ్రామాల సర్పంచులు కంచరాపు సూర్యకళ, రాంబారికి రామలక్ష్మి, ఉపసర్పంచి కల్యాణం రమణ, పంచాయతీ కార్యదర్శి కె బంగారాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి పరిశ్రమలను తీసుకువస్తా : మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-దత్తిరాజేరు: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పిలుపుతో పల్లె పండగ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా శుక్రవారం రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు. పాపయ్యవలస, దత్తి, భోజరాజపురం గ్రామాల్లో నమంత్రి పాల్గొన్నారు. ముందుగా అభివృద్ధి నిధులతో దత్తిరాజేరు నుండి దత్తి గ్రామానికి 2 కోట్లు దత్తి నుండి భోజరాజపురంకి 2 కోట్లు. పాపయ్యవలస గ్రామానికి 1 కోటి నిధులుతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేసారు. అనంతరం అయన మాట్లాడుతూ రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకువస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రాన్ని, నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, జనసేన పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ మర్రాపుసురేష్, మిత్తిరెడ్డి ఈశ్వరరావు, మజ్జి మహేష్, పెద్దింటి మోహన్, బోడసింగి సత్తిబాబు, గోపాలరాజు బంగారు నాయుడు, గాడి కృష్ణ, తాడ్డి రవి టిడిపి, జనసేన, బిజేపి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు ఇండ్ల పట్టాలకు స్థలం కేటాయించాలి

విశాలాంధ్ర-బొబ్బిలి: మున్సిపల్ కార్మికులు గత 30 ఏళ్ల క్రితం వాళ్ల వీధి వెనుక ఉన్న పాత కంపోస్ట్ యాడ్ స్థలం మా కుటుంబాలు పెరుగుతున్నందున ఇళ్లస్థలాల పట్టాలు మంజూరు చేయాలని సంబంధిత శాఖ అధికారులకు వినతి పత్రాలు అందజేసిన ఆ పేద కార్మికులకు పట్టాలు ఇవ్వకుండా మురికి నీరుశుద్ధి కర్మాగారం వాళ్ళ వీధిలో పెడతామంటున్నారు ఇది అత్యంత దుర్మార్గమైన చర్యని సిపిఎం పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. శంకర్రావు సంబంధిత శాఖ అధికారులు తీరు పైన మండిపడ్డారు.30 వ వార్డు పాకివీధి వెనుక సుమారు రెండు ఎకరాల పాత కంపోస్ట్ యార్డ్ స్థలం మున్సిపల్ కాంట్రాక్ట్ పర్మినెంట్ కార్మికుల కుటుంబాలకు పట్టాలు ఇవ్వాలని అనేక సంవత్సరాలుగా పోరాడుతున్న ప్రజా ప్రతినిధులు గాని మున్సిపల్ అధికారులు పట్టించుకోలేదు. ఒక్కొక్క కార్మికుని కుటుంబంలో 3,4 కుటుంబాలు ఒకే ఇంటిలో దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఈ విషయాలన్నీ గత వైసిపి ప్రభుత్వానికి అంతకు ముందు టిడిపి ప్రభుత్వానికి తెలియ జేసిన కార్మికుల సమస్యలు పరిష్కరించలేదని ఆవేదన వ్యక్తం చేశారు.. కార్మికులకు న్యాయం చేయకుపోగా అదే వీధిలో మురికినీరు శుద్ధి కర్మాగారం పెట్టడం అన్యాయమని అన్నారు అదే స్థలంలో స్థానిక ఎమ్మెల్యే బేబీ నాయన కలగజేసుకొని పట్టాలి ఇచ్చి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. అంతవరకు దౌర్జన్యంతో పనిప్రారంభిస్తే కార్మికులు సమ్మెకు కూడా సిద్ధమవుతారని కమిషనర్ కి తెలియజేశారు.

గ్రామ సభలో 8 ఫిర్యాదుల స్వీకరణ : తహసిల్దారు రాములమ్మ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని జమ్మాదేవి పేట గ్రామంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో 8 మంది రైతుల నుండి ఫిర్యాదులు వచ్చాయని తహసిల్దార్ జే.రాములమ్మ తెలిపారు.గత ప్రభుత్వ హాయంలో నిర్వహించిన రీ- సర్వేలలో అక్రమాలు జరిగాయి అంటూ వచ్చిన ఫిర్యాదుల మేరకు గ్రామంలో నిర్వహించిన గ్రామ సభకు 8 మంది రైతుల నుండి ఫిర్యాదులు అందాయని ఈ మేరకు రీ-సర్వేపై వచ్చిన సమస్యలపై విచారణ జరిపి జిల్లా అధికారులకు నివేదించడం జరుగుతుందని ఈ దరఖాస్తులను విచారించి రైతులకు న్యాయం చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ గ్రామ ఎంపీటీసీ వి.వి.చినరామునాయుడు,గ్రామ సర్పంచ్ జి.దేవి, టిడిపి మండల ఉపాధ్యక్షులు పోతల వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ వి.జగ్గిబాబు, పంచాయతీ కార్యదర్శి టి.కన్నం నాయుడు, రీ-సర్వే సిబ్బంది గ్రామ రైతులు పాల్గొన్నారు.

మార్కెట్లో వైన్ షాపులు వద్దు...

ఆందోళన చేపట్టిన మహిళలు

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం మార్కెట్ సెంటర్లో వైన్ షాపు పెట్ట వద్దని, షాపు ప్రారంభ అనుమతులు రద్దు చేయాలని స్థానిక మహిళలు సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనచేపట్టారు. మద్యం షాపు మార్కెట్లో ప్రారంభంను మహిళలు అడ్డుకోవడానికి ప్రయత్నించగా ఎక్సైజ్ అధికారులు వచ్చి వైన్ షాప్ కు వాళ్ళు లైసెన్సులు పెట్టుకున్నారని. వైన్ షాప్ ఎక్కడైనా పెట్టుకోవచ్చుని అధికారులు చెప్పడం తగదని అన్నారు. మహిళలకు ప్రత్యేకమైనటువంటి నిబంధనలు ఏమీ లేవని బాధ్యత లేనట్లు అధికారులు చెప్పడాన్ని సిపిఎం పార్టీ బొబ్బిలి పట్టణ కార్యదర్శి పి. శంకర్రావు తీవ్రంగా ఖండించంచారు. బడి, గుడి, జనవాసాలు రైల్వేస్టేషన్ల, కాంప్లెక్సు హైవే రోడ్లు పై వైన్ షాపులు పెట్టవద్దని నిబంధనలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఆ నిబంధనలు పాటించకుండా టెండర్ వేసే వాళ్లకు ఇష్ట రాజ్యంగా మీకు నచ్చిన చోట వైన్ షాపులు పెట్టుకోండి అని చెప్పడాని తీవ్రంగా ఖండిస్తున్నాం ప్రజలు ఎన్ని ఇబ్బందులు పడినా మహిళలపై ఎన్ని అగత్యాలు జరిగినా, హత్యలు, అత్యాచారాలు జరిగిన ప్రభుత్వానికి డబ్బే తప్ప ప్రజలు బాధలు అక్కర్లేదా? టీడీపీ ప్రభుత్వం ఈ విధంగా వ్యవహరించడం అన్యాయమని అన్నారు. మహిళలపై జరుగుతున్న అన్ని రకాల హింసలకు మత్తు పదార్థాలు కారణమని పోలీసు రికార్డులు చెబుతున్నాయి అయినా పరిపాలించే వాళ్లకు ఆదాయం తప్ప సమాజంలో జరుగుతున్న ఈ అన్యాయాలతో మాకు సంబంధం లేదు అనే విధంగా వ్యవహరించడం సరైనది కాదని అన్నారు. వైన్ షాపులకు కొన్ని నిబంధనలు రూపొందించి ప్రజలకు నష్టం లేకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు పుణ్యవతి, రోజా స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఎస్ కోటలో ముమ్మరంగా శానిటేషన్ పనులు

ఈవో పిఆర్ ఆర్ది లక్ష్మి

విశాలాంధ్ర-శృంగవరపుకోట : శృంగవరపుకోట మండలంలో సానిటేషన్ డ్రైవ్ లో భాగంగా ఈనెల 17 నుండి 20వ తేదీ వరకు మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లోనూ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ ను నిర్వహిస్తున్నట్లు ఈవోపిఆర్ఆర్ది లక్ష్మి తెలియజేశారు. ఇందులో భాగంగా ఎస్ కోటలో ఇటీవల విశాలాంధ్ర కథనాలలో వచ్చిన వార్తలకు స్పందించి వెనువెంటనే కాలువలలో మురుగునీరు నిల్వ సమస్యను గుర్తించి సత్వరమే పరిష్కరించారు. అదేవిధంగా పట్టణంలో ఉన్న ఆర్టీసీ కాంప్లెక్స్ గోడని అనుకుని కల్వర్టు లో నిల్వ ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేయటం జరిగిందని మరియు సీతంపేట గ్రామంలో ఉన్నటువంటి చెరువు చుట్టూ చెత్తను తొలగించి శుభ్రం చేసినట్లు అదేవిధంగా మండలంలో అన్ని గ్రామాల్లో ఈ స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు.

గ్రామాల్లో పల్లె పండగ సందడి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విశాలాంధ్ర-గంట్యాడ: గంట్యాడ మండలంలోపెంట శ్రీరాంపురం , మదనాపురం గ్రామాలలో రాష్ట్ర మంత్రి రాష్ట్ర సూక్ష్మ చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రికొండపల్లిశ్రీనివాస్ పల్లెకు పండగ కార్యక్రమానికి శుక్రవారం ముఖ్యఅతిథిగాహాజరైనారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు మాట్లాడుతూ ముఖ్యంగా పెంట శ్రీరాంపురం గ్రామానికి కూడా అవసరమైన రోడ్డు విస్తరణ మరియు నిర్మాణం పనులకు శంకుస్థాపన చేశారు. అర్హులైన పేదలకు పక్కా ఇల్లు మంజూరు చేయుటకు హామీ ఇచ్చారు రోడ్డు నిర్మాణమునకు అవసరమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులనుండి లభ్యత పొందవచ్చునని అన్నారు స్థానిక గ్రామ ప్రజలు ఐకమత్యంతో ఉండి గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి అని సూచించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎంపీపీలు కొండపల్లి కొండలరావు బీమ్ పల్లి దేవుడమ్మ తెలుగుదేశం మండల పార్టీఅధ్యక్షుడు కొండపల్లి భాస్కరరావు ఎంపీడీవో రమణమూర్తి తాసిల్దార్ నీలకంఠేశ్వర్ రెడ్డి జనసేన నాయకులు ప్రభృతులు పాల్గొన్నారు.

అడ్డంగా వాదించొద్దు...

- ప్రభుత్వమేమీ విఫలం అవ్వలేదు...
- జడ్పీ చైర్మన్ శ్రీనుపై ఎమ్మెల్యే మాధవి ఫైర్
- వాడివేడిగా మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర-పూసపాటిరేగ: మా ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఫెర్టిలైజర్స్ పెట్టి ఎటువంటి సమస్య లేకుండా అందించామని ఈ ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదని యూరియా వంటి సాధారణ పెటిలైజర్స్ కూడా రైతులకు సర్దుబాట్లు మాత్రమే చేస్తున్నారని సర్వసభ్య సమావేశంలో సభ్యులు సమస్యలు లేవనెత్తడంతో సమావేశానికి హాజరైన జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీను ప్రభుత్వం విఫలం అయిందని నోరు జారారు. దీంతో పక్కనే ఉన్న నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం మాధవి కలగజేసుకొని గంభీర స్వరంతో తనదైన శైలిలో ప్రభుత్వం విఫలమవ్వలేదు మీరు అడ్డంగా వాదించకండి. మీరు అన్నదే నిజమైతే సచి వాలయాల్లో గాని అగ్రికల్చర్ ఆఫీసులో గాని మరే అధికారుల కైనా ఫెర్టిలైజర్స్ అందట్లేదని గాని అవసరాన్ని అలుసుగా తీసుకొని ప్రైవేట్ షాపుల్లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు కానీ ఎటువంటి ఫిర్యాదులు రికార్డు అవ్వలేదంటే మీరు చెబుతున్నది నిజం కాదని ఆమె వారించారు. పూసపాటిరేగ మండల కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముందుగా గత సమావేశంలో సభ్యులు చెప్పిన సమస్యల పురోగతిని వివరించారు. అనంతరం మండల అధికారి అధ్యక్షతన శాఖల వారీగా మండలంలో పురోగతి, సమస్యలపై చర్చించారు. జిల్లాలో డయేరియా ప్రభలుతున్న సమస్య దృష్ట్యా హెల్త్ డిపార్ట్మెంట్ ని అప్రమత్తపరిచారు. వ్యవసాయం, ఉపాధి హామీ పనుల కోసం పల్లెల్లో రహదారుల నిర్మాణం వాటిపై వేడివేడిగా చర్చ జరిగింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల ప్రకారంగా గ్రామసభల్లో ఏ ఏ రహదారులైతే తీర్మానం చేసి పంపారు వాటిని జిల్లా పరిషత్ చైర్మన్ నేరుగా ప్రభుత్వానికి సమర్పించమని ఈ తీర్మానం ఇంపార్టెంట్ ఈ తీర్మానం ఇంపార్టెంట్ కాదని ఎటువంటి సిఫార్సులు తన దగ్గరికి రాలేదని అన్నారు. మండలంలో అతి ప్రధాన సమస్య అయినా విద్యుత్ శాఖ రివ్యూ నిర్వహించారు. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఎలక్ట్రికల్ ఏఈకి మండలంలో ఉన్న పరిస్థితుల్ని సభ్యులందరూ వివరిస్తూ సమస్యలను తెలియపరిచారు. రెల్లివలస గ్రామానికి సంబంధించిన సచివాలయ నిర్మాణానికి ప్రభుత్వం నుండి అడ్వాన్స్ నిధులు డ్రా చేసుకొని నిర్మాణ ప్రక్రియ ప్రారంభించకపోవడంతో స్థానిక సర్పంచ్ ఎమ్మెల్యే లోకం మాధవి దృష్టికి తీసుకొచ్చారు. దీనికి సమాధానం ఇస్తూ పతివాడ అప్పలనాయుడు వాళ్ళు ఇచ్చిన అడ్వాన్స్ తనకు రావలసిన బిల్లులు క్లియర్ చేస్తే గాని పనులు ప్రారంభించమని చెప్పారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏ టెండర్ బిల్లులు అటెండర్వే అని వెంటనే పని మొదలు పెట్టాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాధవి తో పాటు జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాస్. ఎంపీపీలు వైస్ ఎంపీపీలు, జడ్పిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు సామూహిక నట్టల నివారణ

విశాలాంధ్ర-లక్కవరపుకోట: గొర్రెలు, మేకలలో సామూహిక నట్టల నివారణ కార్యక్రమము మండలంలోని మార్లపల్లి, కితన్నపేట గ్రామాలలో నట్టల నివారణ కార్యక్రమ ము శుక్రవారం నిర్వహించడం జరిగిందని లక్కవరపుకోట మండల కేంద్రం పశువైద్యాధికారి కోరాడ గాయత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరల పల్లిలో 250 మేకలు, కితన్నపేటలో 16.342 గొర్రెలు, 4477 మేకలు నట్టల నివారణ కార్యక్రమము నిర్వహించడం జరిగిందని తెలిపారు కితన్నపేటలో గొర్రెలు మేకలు అధికంగా ఉన్నందున ఈ నెలాఖరు వరకు నక్కల నివారణ కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు కార్యక్రమంలో మర్లపల్లి సర్పంచ్ భోగాల సత్యం, కితన్నపేట సర్పంచ్ బొక్క వెంకటరావు, కితన్నపేట , మార్లా పల్లి, తిప్పన్నపేట పశుసంవర్ధక సహాయకులు కిరణ్, రఘు పాల్గొన్నారు

టిడ్కో ఇళ్ల కై డబ్బులు కట్టిన వారికి బ్యాంక్ ఖాతాలో డబ్బులు జమచేయాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న

విశాలాంధ్ర-బొబ్బిలి : 2014-19 మధ్యలో టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నపుడు ప్రవేశపెట్టిన టిడ్కో ఇళ్ళ పథకం కోసం అప్పటి గృహ నిర్మాణం శాఖ అధికారులు అనేక మంది పేద లబ్ధిదారులు నుండి 500 రూపాయలు నుండి, 12 వేల ఐదు వందలు, రూ25, వేల రూపాయలు మూడు కేటగిరీలుగా , డిపాజిట్ లు కట్టియున్నారు.. దాదాపు 80 శాతం వరకు టీడ్కో గృహాలు నిర్మాణాలు పూర్తి చేశారు. టీడీపీ ప్రభుత్వం .2019 లో అధికారం కోల్పోవడంతో వైసీపీ ప్రభుత్వం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక, టిడ్కో గృహాలు నిర్మాణాలు పూర్తిగా గాలికి వదిలేయడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం జగనన్న కాలనీలు ఇచ్చారు.టిడ్కో ఇళ్ళ కోసం. లబ్ధిదారులు కట్టిన 500 రూపాయలు, 12,500, 25 వేల రూపాయలు, పై అప్పుల్లో చెల్లిస్తామని హామీ ఇచ్చిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం నేటి వరకు చెల్లించక అప్పులు చేసే డీడీలు కట్టిన లబ్ధిదారులు చేసిన అప్పులు చెల్లించక తీవ్ర ఆర్థిక ఇబ్బంది పడుతున్నారని ఆందోళన చెందుతున్నారు . అనేక వార్డుల్లో కొంతమందికి టిట్కో గృహాలు రద్దుచేసి జగనన్న ఖాళీ స్థలాలు సెంటు భూమి పట్టాలు మంజూరు చేశారు. కొంతమంది లబ్ధిదారులు రెండు వాయిదాల నుండి మూడు వాయిదాల వరకు వివిధ బ్యాంకులకు డబ్బులు చెల్లించారు. కానీ అప్పటి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం టిట్కో లబ్ధిదారులకు డీడీలు కట్టిన వారికి డబ్బులు జమ చేస్తామని గత ఐదేళ్లుగా లబ్ధిదారులు మోసం చేసిందని ఆరోపించారు. టిట్కో గృహాలుకు డీడీలు కట్టినవారు అప్పులు చెల్లించాలని బ్యాంక్ అధికారులు లబ్ధిదారులు బ్యాంక్ ఖాతాలో డబ్బులు పడితే ఆ డబ్బులను లబ్ధిదారులకు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారని అన్నారు. టీడ్కో ఇల్లు రాలేదు డబ్బులు కూడా వెనక్కి ఇవ్వలేదు ... అటు ఇల్లా లేదు, డబ్బులు లేవు అంటూ పేద, మధ్య తరగతి ప్రజలు లబోదిబోమన్నా పట్టించుకునే నాథుడే లేడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే కే రంగారావు (బేబినాయన) స్పందించి టిట్కో గృహాలు కోసం డబ్బులు కట్టిన లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని లేనియెడల భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో లబ్ధిదారులతో మున్సిపల్ కార్యాలయం ముందు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట హెచ్చరించారు.

వర్షాలపై అప్రమత్తం

మండల స్థాయి అధికారులకు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశాలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో సమీక్ష

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లాలో ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయని, వచ్చే మూడు నాలుగు రోజుల్లో బంగాళాఖాతంలో అల్పపీడనం దృష్ట్యా మరింతగా వర్షాలు కురిసే అవకాశం వుందని వాతావరణ శాఖ హెచ్చరించిన దృష్ట్యా మండల స్థాయిలో అధికారులంతా అప్రమత్తంగా వుండాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ ఆదేశించారు. తుఫానులు, భారీవర్షాలు వంటి పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని ముందుజాగ్రత్త చర్యలు చేపడుతూ ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సన్నద్ధంగా వుండాలని చెప్పారు. జిల్లాలోని తహశీల్దార్‌లు, ఎంపిడిఓలు, మునిసిపల్ కమిషనర్‌లు, వైద్యాధికారులు, గ్రామీణ నీటిసరఫరా అధికారులతో కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ కార్యాలయం నుంచి సమీక్షించారు. ఈనెల 22 నుంచి బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని, అది ఉత్తరాంధ్ర జిల్లాలపై ప్రభావం చూపే అవకాశం వుందని వాతావరణ కేంద్రం హెచ్చరికలు జారీచేస్తున్న దృష్ట్యా రెవిన్యూ డివిజన్ అధికారులు, తహశీల్దార్లు, మండల ప్రత్యేక అధికారులు తమ మండలాల పరిధిలో అన్ని ముందస్తు ఏర్పాట్లు చేయాలన్నారు. రెండు తీరప్రాంత మండలాల పరిధిలోని గ్రామాల్లో తుఫాను షెల్టర్ల పరిస్థితిపై నివేదించాలని చెప్పారు. తుఫాను షెల్టర్లు వినియోగించేందుకు అనువుగా లేకపోతే ఆయా గ్రామాల ప్రజలను తరలించేందుకు ప్రత్యామ్నాయ ప్రదేశాలను గుర్తించాలన్నారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో భారీవర్షాలు, వరదల కారణంగా ఎదురయ్యే పరిస్థితిని ఎదుర్కొనేందుకు సన్నద్ధం కావాలన్నారు. కల్వర్టులు, డ్రైనేజీ కాల్వలు, వాగులు వంటి చోట్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది పనిచేసే ప్రదేశంలో నివాసం వుంటూ వచ్చే వారంరోజులూ నిరంతరం పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామాల్లోనూ వచ్చే పదిరోజులూ నిరంతరం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. పంచాయతీల్లో 15వ ఆర్థికసంఘం నిధులు అందుబాటులో వున్నాయని, వీటిని వినియోగించి డ్రైన్లను పరిశుభ్రం చేయడం, గ్రామం మధ్యలో చెత్త, పెంటకుప్పలు తొలగింపు, వీధుల్లో బ్లీచింగ్ చల్లడం, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్ వంటి పనులన్నీ చేపట్టాలన్నారు. తాగునీటి సరఫరా, పారిశుధ్యం, ఆరోగ్య సంరక్షణ వంటి అంశాల్లో పంచాయతీరాజ్, గ్రామీణ నీటిసరఫరా, వైద్య ఆరోగ్యశాఖల అధికారులు జిల్లా నుంచి మండల స్థాయి వరకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. డయేరియా వంటి వ్యాధులు మళ్లీ ఎక్కడైనా ప్రబలినట్లయితే సహించబోమని స్పష్టంచేశారు. వాగులు, గెడ్డల నుంచి ప్రజలు తమ ఇళ్ల నిర్మాణం కోసం ఇసుకను తీసుకువెళ్లేందుకు అనుమతించాలని చెప్పారు. పల్లెపండుగ కార్యక్రమాన్ని నిర్వహించి సంబంధిత ఫోటోలను అప్‌లోడ్ చేయాలని సూచించారు.వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా పరిషత్ సి.ఇ.ఓ. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

పేరు మార్పు

తెలుగుంట కోటేశ్వరరావు s/o లేట్. వెంకట రమణ (పాత పేరు) డోర్ నంబర్-9-97, కంధాల వీధి, శృంగవరపు కోట (గ్రామం & మండలం) విజయనగరం జిల్లా. తెలుగుంట కోటేశ్వరరావు (పాతపేరు) అనే పేరుని ఇక నుండి నా పేరు **తెలుగుంటి కోటేశ్వరరావు** (కొత్త పేరు)గా మార్చుకున్నాను.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL JUNIOR CIVIL JUDGE CUM 1ST ADDITIONAL JUDICIAL MAGISTRATE OF FIRST CLASS, VIZIANAGARAM
E.P.148/2023, O.S. 34/2023

Between;
Sri Rongali Appa Rao ...Decree Holder
And:
Vaddi Jhan Prasad Rao ...Judgment Debtor

To,
The Judgment Debtor:
Vaddi Jhan Prasad Rao S/o late Appa Rao, Sr.Asst, aged 59 years, Sub-Division Office, Panchayat Raj Dept., Opp.Collectorate Parvathipuram town, Parvathipuram Manyam district.

Please take notice that the above named Decree Holder filed the above **E.P.148/2023** against you for claiming decree amount as per decree in **O.S.34/2023** and the matter coming for your appearance and stands posted to **27-11-2024**, on that day your personally or through your Advocate attend before the Honorable Court at **10-30** A.M., failing which the Honorable Court will be heard and determined in your absence exparte as per Law.

P.S.R.MURTHY.,
Advocate
Vizianagaram.
94403 45113

4 గ్రామాల్లో పల్లె పండుగ, శంకుస్థాపనలు

విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని నాలుగు గ్రామాల్లో అక్కివరం గోలగాం నాతవలస గుణుపూర్ పేట గ్రామాల్లో పల్లె పండుగ శంకుస్థాపనలు శుక్రవారం ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర రావు ఆధ్వర్యంలో జరిగాయి మండలం గ్రామంలో సి.సీ రోడ్ నిర్మాణం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవాని ఈవోపీఆర్డి శ్రీనివాస్ మాజీ జడ్పిటిసి కంది సూర్యనారాయణ సర్పంచ్ కంది కిరణ్ టిడిపి నాయకులు కంది సురేష్ ఉప సర్పంచ్ కంది సత్యనారాయణ గ్రామ కార్యదర్శి భారతి తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రెవెన్యూలో తప్పుచేస్తే క్షమాపణే శిక్షా..!

ఆన్‌లైన్‌లో ఇష్టానుసారం పేర్లు నమోదు

పొరపాటు జరిగిందని అంగీకారం.. కానీ సరిదిద్దని వైనం

విశాలాంధ్ర-జామి: తప్పులకు కేరాఫ్ అడ్రస్‌గా రెవెన్యూ శాఖనే ప్రజలు చెప్పుకుంటారు. దానిలో వాస్తవమెంత ఉందో కానీ.. తప్పులు చేసిన వారిపై

చర్యలు తీసుకోకపోవడం కూడా అటువంటి తప్పులను ప్రోత్సహించడమేనని మాత్రం చెప్పవచ్చు. మండలంలోని గొడుకొమ్ము రెవెన్యూలో భూముల మ్యూటేషన్‌లలో అనేక తప్పులు జరిగాయనే ఆరోపణలు వినిపిస్తునే ఉన్నాయి. అందులో భాగంగా ఇటీవల ఓ భూమికి సంభందించి ఏళ్ళ తరబడి సాగుచేస్తున్న రైతులకు తెలియకుండానే హక్కుదారు లంటూ రెవెన్యూ అధికారులే వేరొకరిని నిర్ధారణ చేసి మ్యూటేషన్ చేసేసారు. కొద్ది రోజులకు ఈ విషయం ఎలాగో తెలుసుకున్న బాధితుడు లబోదిబో మంటున్నాడు.

గొడుకొమ్ము రెవెన్యూ జి. సింగవరం గ్రామంలో (ఎల్‌పిఎం నెం. 487)సర్వే నెం.61-13లో 0.64 సెంట్లు, (ఎల్‌పిఎంనెం. 483)సెశ్వటశ్రీబన్ర. 61-13లో 0.83సెంట్లు భూమిని దాదాపు 40 ఏళ్ళ క్రితం కడగల వారి కుటుంబ సభ్యులనుంచి అలమండ గ్రామానికి చెందిన బందారు వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులు కొనుగోలు చేసారు. ఈ సమయంలో డాక్యుమెంట్లు రాయించుకున్నారు. అయితే ఎఫ్‌సివోలో మాత్రం కడగల కుటుంబసభ్యులు పేర్లు ఉండడంతో ఈ భూమి హక్కులు కావాలని కడగల కుటుంబసభ్యులు ఇప్పుడు రెవెన్యూ అధికారులతో మంతనాలు జరిపారు. ఈ నేపధ్యంలో సాగుదారులకు తెలియకుండానే ఘనత వహించిన రెవెన్యూ అధికారులు గుట్టు చప్పుడు కాకుండా మ్యూటేషన్ చేసేసారు. ఈ తతంగం వెనుక చేతుల మారాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. అనంతరం విషయం తెలుసుకున్న సాగుదారులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు. దీంతో డొంక కదిలింది అనుకున్నారు. ఈ మ్యూటేషన్‌కు సంభందించి అధికారికంగా తప్పు జరిగిందని స్వయంగా తహాశీల్దార్ సాగుదారులకు లిఖిత పూర్వకంగా సమాధానం ఇచ్చారు. ఆన్‌లైన్‌లో నిషేధిత జాబితాలో ఆయా సర్వే నెంబర్లను పెడతామని హామీ ఇచ్చారు. కానీ నెలలు గడుస్తున్నా ఈ సర్వే నెంబర్లను నిషేధిత జాబితాలో పెట్టలేదు. సరికదా ఈ మ్యూటేషన్‌కు బాధ్యులైన వారంతా ప్రస్తుతం బదిలీ అయి ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోయారు. దీంతో కథ కంచికి చేరిందని అందరూ అనుకుంటు న్నారు. అయితే తన సమస్యను పరిష్కరిం చకుండా తాత్సారం చేయడంతోపాటు బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడంతో బందారు కుటుంబసభ్యులు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించి తమ ఆవేదన తెలిపేందుకు సిద్దమవుతున్నారు. తప్పులు చేసిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోకపోతే మరిన్ని తప్పులు చేసేందుకు అవకాశం ఉంటుందని ప్రజలు అనుకుంటున్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

ఎంపీడీవో భవాని

విశాలాంధ్ర-డెంకాడ: ప్రజలందరూ మీరు నివసిస్తున్న ప్రదేశాలను పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డెంకాడ మండలం ఎంపీడీవో భవాని అన్నారు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు డెంకాడ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో శుక్రవారం గ్రామపంచాయతీ కార్యదర్శులు సర్పంచుల ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పరులు నిర్వహించారు ఈ కార్యక్రమంలో కాలువలు పూడిక తీయటం జంగిల్ క్లియరెన్స్ వాటర్ ట్యాంకులు క్లీనింగ్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు దాన్లో భాగంగా ఈరోజు ఆమె స్వయంగా రెండు గ్రామపంచాయతీలలో పినతాటివాడ డెంకాడ గ్రామపంచాయతీలలో స్వయంగా పాల్గొని పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భవాని ఈవోపిఆర్ డి శ్రీనివాసరావు పినతాడి గ్రామ సర్పంచ్ లెంక లక్ష్మణరావు గ్రామ కార్యదర్శి వెంకట్రావు డెంకాడ గ్రామ కార్యదర్శి తులసి ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రీ-సర్వేలో చేసిన తప్పులు సరిచేయుటకే రెవెన్యూ సదస్సులు : తహశీల్దార్

విశాలాంధ్ర-తెర్లాం: ప్రభుత్వ ఆదేశాల ప్రకారం శుక్రవారం నెమలాం గ్రామ సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు ముఖ్య అతిథిగా తాసిల్దార్ జి హేమంత్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నిర్వహించిన రీ- సర్వేలో చేసిన తప్పులు సరిచేయుటకే రెవెన్యూ సదస్సులని, కావున రైతులందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు. రైతులందరూ సిబ్బందికి సహకరించి వారి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మజ్జి. నరసింహులు, మాజీ జెడ్పిటిసి బోను అప్పలనాయుడు, ఆర్ఎస్ హెచ్ డిటి రవి కిరణ్, ఎంఆర్ఐ ఎంకే ఎస్ నాయుడు, మండల సర్వేయర్ వి సాయి, వీఆర్వో ఎస్ శ్రీనివాసరావు, మండల రెవెన్యూ సంఘం అధ్యక్షులు ఎస్ నరసింహ నాయుడు, వీఆర్వోలు పాల్గొన్నారు.

అరసబలగ గ్రామ పంచాయితీ లో పూడికతీత పనులు

విశాలాంధ్ర-తెర్లాం: మండలంలో అరసబలగ గ్రామ పంచాయితీ లో సర్పంచ్ కొరగంజి సాయిరాం ఆధ్వర్యంలో కాలువల్లో పూడిక తీయించారు.అలాగే దోమలు వృద్ధి చెందకుండా దోమలు మందు స్ప్రే చేయించడం జరిగింది.

పల్లె పండుగ లో భాగంగా తెర్లాం లో భూమి పూజ

విశాలాంధ్ర-తెర్లాం : మండల కేంద్రం తెర్లాం లో శుక్రవారం పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా స్థానిక సర్పంచ్ బోడెల. రూప, ఎంపిటిసి జి ఆనంద్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎన్ వెంకట్ నాయుడు, మాజీ ఎంపీపీ ఎం వెంకటేశ్వరరావు, ఎంపీడీవో రేగు. రాంబాబు, ఏపీవో కే సుశీల, గ్రామానికి ఉపాధి హామీ పనుల్లో భాగంగా సిమెంట్ రోడ్లు, సిమెంట్ కాలువలు కు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్ర సహాయకుడు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులకు ఎమ్మెల్యే అభినందనలు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: జాతీయస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కొండవెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారులను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి శుక్రవారం అభినందించారు. హిమాచల్ ప్రదేశ్ లో తాజాగా జరిగిన జూనియర్, సీనియర్ ఛాంపియన్ షిప్ పోటీల్లో పతకాలు సాధించిన పల్లవి, శ్రీలక్ష్మి, చైతన్య కుమారి, దినేష్ కోచ్ చల్లా రాముతో కలిసి ఎమ్మెల్యే మాధవిని కలిశారు. ఈ సందర్భంగా ఆమె క్రీడాకారులను అభినందించారు. జాతీయస్థాయిలో నెల్లిమర్ల నియోజకవర్గానికి మంచిపేరు తీసుకొచ్చారని కొనియాడారు. ఎంపీపీ అంబల్ల సుధారాణి, సౌత్ సెంట్రల్ రైల్వే సలహా మండలి సభ్యులు అంబల్ల శ్రీరాములనాయుడు, ఎన్డీయే కూటమి నాయకులు కడగల ఆనంద్ కుమార్, గేదెల రాజారావు, చనమల్లు వెంకటరమణ, రవ్వా నాని తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్ ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు



విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : గవర్నర్ అబ్దుల్ నజీర్ ను రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు మర్యాద పూర్వకంగా కలిసారు.ఈ సందర్భంగా ఆదివాసీ సమస్యలను గవర్నర్ కు ఆయన తెలియజేసారు.

అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన

విశాలాంధ్ర-రాజాం: రాజాం మండల పరిధిలోని బొద్దాం, కొఠారిపురం, సోపేరు గ్రామాల్లో పల్లె పండుగ కార్యక్రమం లో భాగంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నుండి మంజూరు కాబడిన సిసి రోడ్, కాలువలు పనులకు భూమి పూజ చేయడ మయినది. గురవనా నారాయణరావు,ఎంపిడివో వావిలపల్లి శ్రీనివాసరావు, మద్దు హరినాథ్ టీడీపీ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వావిలపాడులో సీసీ రోడ్లకు డ్రైనేజీ కాలువలకు శంకుస్థాపన

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వావిలపాడు గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం సీసీ రోడ్లకు డ్రైనేజీలకు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేసారు. రూ.10 లక్షల రూపాయల జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా నిర్మించి తలపెట్టిన ఈ సీసీ రోడ్లు డ్రైనేజీ కాలువలకు నిధులు మంజూరు అవ్వగా ఈ మేరకు శుక్రవారం శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ టిడిపి నాయకుల గుంటపల్లి దేముడు నాయుడు, గోగాడ జగన్నాథం నాయుడు, వేచలపు ముత్యాల నాయుడు, గుంటపల్లి గోవింద, పంచాయతీ కార్యదర్శి టి. కన్ననం నాయుడు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అర్బన్ క్రూయిజర్ టైజర్ లిమిటెడ్ ఎడిషన్ విడుదల చేసిన టొయోటా కిర్లోస్కర్ మోటార్

విశాలాంధ్ర-విజయనగరం: టొయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) ఈరోజు తమ అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్ అర్బన్ క్రూయిజర్ టైజర్ యొక్క లిమిటెడ్ ఎడిషన్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ ప్రత్యేక ఎడిషన్, స్టైల్ ప్రీమియం నెస్‌ని మెరుగుపరచడంపై దృష్టి సారించి రూపొందించబడిందని టొయోటా కిర్లోస్కర్ మోటార్, సేల్స్ సర్వీస్ యూజ్డ్ కార్ విభాగ ప్రతినిధి శబరి మనోహర్ తెలిపారు. కస్టమర్‌లకు మరింత ఆనందం ఇస్తూ ఈ పరిమిత ఎడిషన్ రూ. 20,160 విలువ కలిగిన టొయోటా జెన్యూన్ యాక్సెసరీస్ (టిజిఏ) ప్యాకేజీతో వస్తుందన్నారు. అర్బన్ క్రూయిజర్ హైరైడర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను ఇటీవలే పరిచయం చేసిన తర్వాత అర్బన్ క్రూయిజర్ టైజర్ ఫెస్టివ్ ఎడిషన్‌ను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. 1.0 లీ టర్బో 5 స్పీడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ మరియు 6 స్పీడ్ ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్‌లో ఇది లభిస్తుందన్నారు. సమీప డీలర్ షిప్ లో గాని, ఆన్ లైన్ లో గాని బుక్ చేసుకోవచ్చని చెప్పారు.

వసతి గృహాల సందర్శన, తనిఖీ

విశాలాంధ్ర-రేగిడి/రాజాం: రాజాం లోని ప్రభుత్వ వెనుకబడిన తరగతుల కళాశాల బాలుర వసతి గృహాన్ని, రేగిడి ఆమదాలవలస మండలములోని దేవుదల గ్రామములోని కేజీబీవీ వసతి గృహమును, అంబాడ వెంకటాపురములోని ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని, రాజాం మండల న్యాయ సేవా సంఘం అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి సి. హెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ ఆకస్మికముగా సందర్శించి తనిఖీలు నిర్వహించి మౌలిక సదుపాయములుగూర్చి స్వయముగా పరిశీలించి తెలుసుకోవడం జరిగింది. వసతి గృహాల గదులను, వంటగదిని, స్టోర్రూంను. రోజువారీ అందిస్తున్న ఆహార మెనుని పరిశీలించారు. అంతేకాకుండా, జీవన పరిస్థితులను, పరిసరాల స్థితిగతులను, పరిశీలించడం జరిగింది. బాలురు, బాలికలకు అందుతున్న సదుపాయాలు అనగా భోజన సదుపాయములు, తాగునీటి సదుపాయములు, పరిశుభ్రత, వారికి అందిస్తున్న వైద్య సదుపాయలను, తదితర అంశములను స్వయముగా వారినే అడిగి తెలుసుకున్నారు. అంతేకాకుండా. ఆడపిల్లల విషయములో తగు జాగ్రత్తలు తీసుకొనుచున్నారో లేదో అడిగి తెలుసుకున్నారు. వారికి ప్రభుత్వం అందజేస్తున్న పలు పథకాలు గూర్చి అడిగి తెలుసుకున్నారు.. వసతి గృహాలలో పనిచేస్తున్న స్వీపర్, వంటమనిషి, కమాటి, వాచ్మెన్, తదితరులను కూడా వారికి జీతభత్యాలు అందుతున్నది లేనిది అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమములో జడ్జ్ వివేక్ ఆనంద్ శ్రీనివాస్ తో పాటు రాజాం ప్రభుత్వ న్యాయవాది ఎస్. పోలారావు, బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఆర్.ఈ.సి.హెచ్. జయదేవ్, సెక్రెటరీ వై.ఈశ్వరరావు, రాజాం మరియు రేగిడి ఆమదాలవలస పోలీసులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలు: తహశీల్దార్

విశాలాంధ్ర-డెంకాడ: గ్రామాల్లోని రైతు సమస్యల పరిష్కారం కోసమే గ్రామ సభలో నిర్వహిస్తున్నట్లు మండల తాసిల్దార్ పద్మావతి పేర్కొన్నారు దానిలో భాగంగా మండలంలోని చిట్టి గుంకలాం గ్రామంలో శుక్రవారం రీ సర్వే భూ సమస్యల పరిష్కార గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి తాసిల్దార్ మాట్లాడుతూ భూ సమస్యలు అనగా విస్తీర్ణములో గాని, పట్టాదారు పేరు తప్పులు దొర్లిన, జాయింట్ ఫీల్డ్ విభజన, పాసు పుస్తకాల పైన ఉన్న ఫోటోల్లో తప్పులు ఉన్న, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే దానికి తగ్గ ఆధారాలు చూపిస్తే సరి చేయడం జరుగుతుందని ఆమె తెలిపారు. ఈ గ్రామ సభల ద్వారా రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకొని సమస్యల పరిష్కారం చేసుకోవాలని సూచించారు. రీ సర్వే జరిగే గ్రామాల్లో మాత్రమే ఈ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కావున సంబంధిత రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో హెచ్ డి టి ప్రసాదరావు, వీఆర్వోలు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామ జంక్షన్ల వద్ద సంకల్పం ఫ్లెక్సీలు ఏర్పాటు: ఎస్సై



విశాలాంధ్ర-డెంకాడ: మండలంలోని పినతాడివాడ జంక్షన్ పోలీస్ స్టేషన్ ఎదురుగా డెంకాడ నాతవలస జంక్షన్ లలో శుక్రవారం డెంకాడ ఎస్సై సన్యాసినాయుడు ఆధ్వర్యంలో సంకల్పం ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు ఈ కార్యక్రమంలో ఆయన వెంట సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన రావణబ్రహ్మ ఏకపాత్రాభినయం

విశాలాంధ్ర-విజయనగరం ఫోర్ట్: పైడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా శుక్రవారం పైడితల్లి అమ్మవారు వనం గుడిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల లో భాగంగా రావణబ్రహ్మ ఏక పత్రాభినయం నాటక ప్రదర్శన నిర్వహించారు. రావణబ్రహ్మ పాత్ర మక్కువ సీతం నాయుడు కుమారుడైన మక్కువ మారినాయుడు పూర్తిస్థాయి నాటకాన్ని ప్రదర్శించారు. ప్రముఖ రంగస్థలం కళాకారులు ప్రదర్శించిన పౌరాణిక నాటకాలు నాటక క్రియలను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమం జానపద కళాకారుల నాయకులు పి. షణ్ముఖరావు ప్రారంభించారు.

ఏఐఎస్ఎఫ్ 49వ రాష్ట్ర మహాసభల కరపత్రం విడుదల చేసిన డిఈవో ప్రేమ్ కుమార్

విశాలాంధ్ర-రాజాం : ఏఐఎస్ఎఫ్ఆవిర్భావ చరిత్రను, పోరాట ప్రతిమను మరియు విజయనగరం జిల్లాలో నిర్వహిస్తున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభల ప్రాముఖ్యతను డీఈవో ప్రేమ్‌కుమార్ కి వివరించిన ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నాయకులు అనంతరం ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభ జయ ప్రదానికి సహకరించాలని డిఈఓ కి విజ్ఞప్తి చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకత్వం ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి జీ. ఫణీంద్ర, జిల్లా కార్యదర్శి ఎన్.నాగభూషణం, సహాయ కార్యదర్శులు పి.గౌరీశంకర్, ఎ.సుమన్ తదితరులు పాల్గొన్నారు.

డయేరియా రాకుండా అప్రమత్తంగా ఉండాలి

- డాక్టర్ లోకప్రియ
- ముందు జాగ్రత్తగా సిబ్బందికి తగుచూచనలు
- ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని హెచ్చరిక

విశాలాంధ్ర-మెంటాడ : జిల్లాలో కొన్నిచోట్ల డయేరియా వ్యాధి ప్రబలినట్లు వార్తలు వస్తున్నా సందర్భముగా మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సిహెచ్ లోకప్రియ డాక్టర్ కల్పన స్పందించారు. మెంటాడ పీహెచ్ సి పరిధిలో ఉన్న గ్రామాల ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు హెల్త్ సిబ్బందికి అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ లోక్ ప్రియ మాట్లాడుతూ మండలంలో డయేరియా రాకుండా అప్రమత్తంగా ఉండాలని డయేరియా వ్యాధి వ్యాపించకుండా తగు చర్యలు ముందు జాగ్రత్తగా చేపడితే ఎటువంటి డయేరియా లక్షణాలు రాకుండా నివారించగలమని అన్నారు. ఎవరికైనా గ్రామంలో రెండు మూడు విరోచనాలు లేక వాంతులు అవుతున్న తరుణంలో వారిని గుర్తించి వెంటనే 108 వాహనం ద్వారా పీహెచ్ సి తరలించి తక్షణ వైద్య సహాయం అందించేలా సిద్ధంగా ఉండాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. ఏ ఒక్కరు కూడా పీహెచ్ సి పరిధిలో డయేరియా వ్యాధితో మరణం సంభవించుకుండా అత్యవసర చికిత్స అందించి తగు చర్యలు చేపట్టాలని ఏఎన్ఎం లకు ఆశ వర్కర్ల ను ఆదేశించారు. ముఖ్యంగా డయే రియాతో

బాధపడుతున్న వారు వేడి నీళ్లు చల్లార్చి తాగాలని ఆరుబయట హెూటల్ లో ఫాస్ట్ ఫుడ్ సెంటర్లో తినుబం డారాలు తీసుకోకూడదని తెలిపారు. గ్రామంలో ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని భోజనం చేసే ముందు చేతులు పరిశుభ్రంగా సబ్బుతో కడుక్కుని భోజనం చేయాలని అన్నారు. ఈ సీజన్ లో చిన్న పిల్లలు గర్భిణీ స్త్రీలు, బాలింతలు డయేరియా వ్యాధి చోకే అవకాశం ఉంది కాబట్టి వ్యాధికి సంబంధించిన లక్షణాలు ఎవరిలోనైనా కనిపించిన ఎడల వెంటనే దగ్గర్లో ఉన్న ఆరోగ్య సిబ్బంది సహాయ సహకారాలు తీసుకోవాలని ఆమె కోరారు. డయేరియా వ్యాధి రాకుండా ముందస్తుగా వేడి పదార్థాలు తీసుకోవాలి. వీధి కాలువలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని కాలువలలో బ్లీచింగ్ చెల్లి తగు చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. గ్రామాల్లో ఉన్న సర్పంచులు ప్రజా ప్రతినిధులు అన్ని విధాలుగా వారి సహాయ సహకారాలు తీసుకోవాలని డయేరియా వ్యాధి రాకుండా చూడాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ సి సి హెచ్ ఓ సత్యనారాయణ, హెచ్ వి జ్యోతి, యు డి సి స్వామి, ఏ ఎన్ ఎం లు, ఆశా కార్యకర్తలు ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ..

రాజీవ్ ఇండోర్ మైదానంలో వాలీబాల్ క్రీడాకారుల ఎంపిక

విశాలాంధ్ర- విజయనగరం పోర్ట్: రాజీవ్ ఇండోర్ స్టేడియంలో అండర్ 17 పురుషులు మరియు స్త్రీలు జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ సెలెక్షన్స్ శుక్రవారం జరిగాయి. ఈ కార్యక్రమం డిఎస్డిఓ ఎస్. వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ పోటీలకు మన్యం విజయనగరం ఉమ్మడి జిల్లాల నుండి పురుషులు 120 మంది స్త్రీలు 60 మంది పాల్గొన్నారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు అనంతరం జిల్లా హిందూపురంలో 21- 10 -24 నుండి 23 -10 -24 వరకు జరగనున్న అంతర్జాతీయ వాలీబాల్ పోటీలకు పంపబడునని ఆయన అన్నారు. అండర్ 17 స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వాలీబాల్ బాలికల విభాగం లొ కె. కళావతి - %ణతీ దీ=% అంబేద్కర్ వియంపేట, ఎం. యువాంజలి, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ తాటిపూడి, బి అను ఎం జె పి జూనియర్ కాలేజీ నెల్లిమర్ల, ఎం మౌనిక జి టి డబ్ల్యూ హెచ్ ఎస్, లంక జోడు, సిహెచ్ మాధురి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల గరుగుబిల్లి, డి పవిత్ర ఏపీ మోడల్ కాలేజ్ సాలూరు, డీ లోహిత జడ్పీ హైస్కూల్ రఘుమండ, డి సుజన

జడ్పీహెచ్ఎస్ రామచంద్ర పేట, బి రమ్య జడ్.పి.హెచ్.ఎస్ రామచంద్ర పేట, ఏ అపర్ణ జడ్పిహెచ్ఎస్ రామచంద్ర పేట, కే సన్యాసమ్మ జడ్పీహెచ్ఎస్ భోగాపురం, కే, లలిత, జడ్పీహెచ్ఎస్, పోరామ్, అలాగే స్టాండ్ బై లుగా %ఎ%. హారిక, జడ్పీ హైస్కూల్ భోగాపురం, ఆర్, అనిత, జడ్పిహెచ్ఎస్ చీపురుపల్లి, పి లావణ్య. జడ్.పి.హెచ్.ఎస్ పోరామ్, బి ధిల్లేశ్వరి, జడ్.పి.హెచ్.ఎస్ కొత్తవలస ఎంపికయ్యారని స్కూల్ గేమ్స్ సెక్రెటరీ కె. కృష్ణంరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో కె .వి. ఏ .ఎస్ .రాజు, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖకు వాల్టా చట్టం చుట్టమా?

పర్యావరణ వేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ ..

విశాలాంధ్ర-శృంగవరపుకోట: పెందుర్తి నుండి బౌడార జాతీర రహదారి 516బి పక్కన భవానీనగర్ దగ్గర లో ఒక ప్రైవేటు పాఠశాలకు ఎదురుగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో యిష్టారాజ్యంగా చెట్లు నరికివేయబడ్డాయి. విద్యుత్ స్థంబాలు పాతేందుకు కొంతమంది కార్మికులను పాటూరుకు చెందిన గుత్తేదారులు జనాలు, పల్లి వేణుగోపాల్ లు ఏర్పాటు చేసినట్లు కార్మికులే తెలియజేసారు. విద్యుత్ స్థంబాల ఏర్పాటు నెపముతో లైన్ మాన్ చిట్టిబాబు సమక్షములోనే స్థంబాలకు అడ్డుతగలని, ఇరవై అడుగుల దూరంలో గల వేప, చింత, తుమ్మ, తురాయి చెట్ల కొమ్మలను అనాలోచితంగా తొలగించేసారు. అంతేకాకుండా విద్యుత్ తీగెల ఏర్పాటుకు ఏమాత్రం ఆటంకం కాని పన్నెండు తాటిచెట్లను నరికివేసారు. సంఘటన స్థలంలో విద్యుత్ శాఖకు సంబంధించిన అధికారులు గాని, సాంకేతిక పరిజ్ఞానం గల సిబ్బంది గాని, గుత్తేదారులు గాని లేకపోవడము నిర్లక్ష్యాన్ని సూచిస్తుంది. లైన్ మాన్ చిట్టిబాబు తనకు కేవలం విద్యుత్ ప్రవాహాన్ని మాత్రమే నిలుపుదల చేయమని చెప్పారని, చెట్లు నరికివేతకు, తనకు సంబంధం లేదని చెప్పగా, కార్మికులలో ఒకరు విద్యుత్ శాఖ అధికారి ఏ.ఈ. చెట్లను తొలగించమని చెప్పారన్నారు. ఆటంకం కాని తాటిచెట్లను కూడా ఏ.ఈ. తొలగించమన్నారా అని ప్రశ్నించగా మిన్నకుండిపోయారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పర్యావరణవేత్త, న్యాయవాది బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ గత ఏడాది కూడా గుత్తేదారుడు జనాలు సిబ్బంది ప్రథమ శ్రేణి మరియు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఆవరణలో చెట్లను నిర్లక్ష్యంగా నరికివేసినపుడు గౌరవ న్యాయమూర్తి దృష్టికి విషయాన్ని తెలియజేయగా సిబ్బంది ద్వారా ఏ.ఈ. ని వివరణకు ఆదేశించారని అందుకు తాను కూడా ఒక ప్రత్యక్ష సాక్షిని అన్నారు. అయినప్పటికీ విద్యుత్ శాఖ అధికారులలో గాని, గుత్తేదారులో గాని ఎటువంటి మార్పు రాలేదని, పర్యావరణం పట్ల తమ నిర్లక్ష్యధోరణిని ఎప్పటిలాగే కొనసాగిస్తున్నారని అన్నారు. రహదారులు, భవనాల శాఖ వారు కూడా పర్యావరణము పట్ల జాగ్రత్త వహించాలని, తమ పరిధిలోని చెట్లను నిర్లక్ష్యంగా ఏ శాఖ వారయినా అనుమతులు లేకుండా నరికితే చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వములో భాగమైనంత మాత్రాన సామాన్యుడికి వర్తించే వాల్టా చట్టం అధికారులకు, గుత్తేదారులకు వర్తించదా? వాల్టా చట్టం విద్యుత్ శాఖ వారికి చుట్టమా అని పత్రికా ముఖంగా ప్రశ్నిస్తున్నారు. అభివృద్ధి అనేది పర్యావరణ నాశనము పైన జరగకూడదన్నారు. ఏళ్లనాటి చెట్లను నరికివేయడము తగదన్నారు. తాటి చెట్లు పిడుగులను ఆకర్షిస్తాయని, అపాయాల నుండి కాపాడుతున్నాయని, వాటిని నరికివేయడము కారణంగా పిడుగులకు రైతులు, పశువులు, పశువుల కాపరులు బలైపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసారు. కొన్ని కులవృత్తులవారు తమ జీవనమునుగడకు తాటి చెట్లపైనే ఆధారపడి ఉన్నారని, నిర్దాక్షిణ్యంగా వారి పొట్టకొట్టడము తగదని హెచ్చరించారు. విద్యుత్ శాఖవారి నిర్లక్ష్య వైఖరి పై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పర్యావరణ రక్షణ కోసం న్యాయపోరాటానికి ఉద్యమిస్తానన్నారు.

జిల్లాలో రోడ్ల పనులకు కదలిక

ఎన్‌డిబి పనులకు రూ.50 కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లింపు

రోడ్లు భవనాల శాఖ ఎస్.ఇ. కాంతిమతి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లాలో రహదారులు భవనాల శాఖ పరిధిలోని రోడ్ల నిర్మాణం, మరమ్మత్తుల పనులను పెద్ద ఎత్తున నిధులు విడుదల అయినట్లు ఆ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ కాంతిమతి వెల్లడించారు. జిల్లాకు చెందిన చిన్న,మధ్యతరహా పరిశ్రమలు, ఎన్నారై వ్యవహారాలు, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ చొరవ తీసుకొని రోడ్ల పనులపై జిల్లా అధికారులతో జరిపిన సమీక్ష అనంతరం ప్రభుత్వ స్థాయిలో చేసిన ప్రయత్నాలతో పలు విభాగాల కింద రోడ్ల మరమ్మత్తులు, నిర్మాణానికి పెండింగ్ బిల్లులు విడుదల అయినట్లు పేర్కొన్నారు. గతంలో 2020-21లో న్యూ డెవలప్ మెంట్ బ్యాంకు నిధులు రూ.221.89 కోట్లతో ఏడు పనులు ఒకే ప్యాకేజీలో మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇందులో రూ.50 కోట్లకు సంబంధించి పనులను కాంట్రాక్టర్ పూర్తిచేసినట్లు, ఆ బిల్లులను గతంలోనే సి.ఎఫ్. ఎం. ఎస్. ద్వారా ప్రభుత్వానికి సమర్పించడం జరిగిం దన్నారు. ఈ బిల్లులు 2023 మే నెల నుంచి పెండింగ్‌లో వున్నట్టు తెలిపారు. ఇటీవల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ జరిపిన సమీక్ష సందర్భంగా బిల్లుల పెండింగ్ అంశాన్ని తెలియజేయడంతో ప్రభుత్వ స్థాయిలో సంప్రదించి బిల్లుల విడుదలకు చొరవ చూపడంతో ఎన్.డి.బి.పనులకు సంబంధించి రూ.50 కోట్ల బిల్లులు విడుదల అయ్యాయని పేర్కొన్నారు. దీనితోపాటు మరో రూ.10 కోట్లు ఇతర గ్రాంట్లకు సంబంధించిన పనుల బిల్లులు కూడా మంజూరైనట్లు తెలిపారు. వందరోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా జిల్లాలో 79.70 కిలోమీటర్ల రహదారుల మరమ్మత్తులు చేపట్టేందుకు రూ.7.64 కోట్ల పరిపాలన నిధులు విడుదల అయ్యాయని ఎస్.ఇ. వెల్లడించారు.

మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్